క్లుప్తంగా

స్టీల్ వైఎస్సార్‌టీయూసీ జాబితా అందజేత


హెచ్ఆర్ విభాగాధిపతి మధుసూదనరావుకు జాబితా అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్ వైస్సార్‌టీయూసీ నాయకులు నూతన కార్యవర్గం జాబితాను ఉక్కు యాజమాన్యానికి అందజేశారు. ఉక్కు పరిపాలన భవనంలో శనివారం స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ విభాగాధిపతి ఎం. మధుసూదనరావును కలిసి నియామకపు పత్రాలు అందజేశారు. అధ్యక్షుడు కర్రి దాలినాయుడు, ప్రధానకార్యదర్శి డి.వి. రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ డి. పుల్లారావు, ఆర్గనైజింగ్ అధ్యక్షులు పేర్ల నూకరాజు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బోడెం రాజు, ఉపాధ్యక్షులు గోరంట్ల సూర్యనారాయణ, దామూర్తి అప్పలరాజులను జీఎంకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఉక్కు కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ పునరుద్ధరించాలని, కరెంటు చార్జీలు తగ్గించాలని , లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పునరుద్ధరించాలని వారు కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దూడ త్రినాథరెడ్డి, నమ్మి ప్రసాద్, చిత్రాడ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనలో విఫలం

విశాఖ విద్య: అంతర్జాతీయ యోగా దినోత్సవానికి మహిళలను తరలించిన కూటమి ప్రభుత్వ పెద్దలు, వారికి సౌకర్యాలు కల్పనలో మాత్రం ఘోరంగా విఫలమయ్యారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు పేడాడ జ్యోత్స్న అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రజలు యోగా సాధన చేయటం మంచిదేనని, కానీ ఇలా బలవంతపు తరలింపులో అర్థమేంటన్నారు. కూటమి ప్రభుత్వం ప్రచారం కోసం మహిళలను తెల్లవారు జామున 3గంటల నుంచి బలవంతంగా తరలించారని, కానీ వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించలేదన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రచారం మీద ఉన్న శ్రద్ధ, ప్రజలకు మౌలిక సౌకర్యాల కల్పనపై లేదన్నారు. సోమవారం తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమానికి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులంతా తరలిరావాలని కోరారు.

అంబేడ్కర్ గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

కంచరపాలెం: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశాఖ–అనకాపల్లి జిల్లాల్లోని 11 డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉభయ జిల్లాల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల సమన్వయకర్త ఎస్.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4 బాలుర, 7 బాలికల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల బాల బాలికలు ఆయా పాఠశాలల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్‌ను జత చేసి ఈ నెల 24వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 12 గంటల లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. 25న బుధవారం ఉదయం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. వివరాలకు జిల్లా హెల్ప్‌లైన్ నంబర్ 0891–2799641లో సంప్రదించాలని సమన్వయకర్త రామకృష్ణ కోరారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నిత్యకల్యాణం ఉదయం 9:30 గంటల నుంచి వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు వంటి ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం , శేషవస్త్రాలను అందజేశారు. అనంతరం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ అత్యంత విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం ఈ సేవను ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై కొలువుదీర్చారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించి, విశేషంగా హారతి సమర్పించారు. ఈ పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ప్రైవేటు స్కూళ్లలో దోపిడీ!

గోపాలపట్నం మండలంలోని ఎన్ఏడీలో సీబీఎస్ఈ సిలబస్ బోధన పేరుతో ఓ కార్పొరేట్ స్కూల్ ఈ ఏడాది కొత్తగా బ్రాంచ్ ఏర్పాటు చేసింది. వేరే చోట అనుమతులతో ఇక్కడ పాఠశాల నిర్వహిస్తున్నారు. సీబీఎస్ఈ సిలబస్ పేరుతో విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇక్కడ తొమ్మిదో తరగతికి రూ.82 వేలు ఫీజు వసూలు చేస్తున్నారు. బుక్స్, యూనిఫామ్స్ కలిపి రూ.25 వేలు. ఈ లెక్కన తొమ్మిదో తరగతి పూర్తి చేసేందుకు రూ.1.07 లక్షలు చెల్లించాలన్న మాట. కార్పొరేట్ స్కూళ్లలో ఫీజు దోపిడీ ఏ రీతిన ఉందనే చెప్పేందుకు ఇది నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.



మున్సిపల్ స్కూల్

- ఇష్టానుసారం ఫీజుల పెంపు
- స్కూళ్లలోనే పుస్తకాలు, యూనిఫారాల విక్రయం
- చోద్యం చూస్తున్న విద్యాశాఖాధికారులు

విశాఖ విద్య: గోపాలపట్నం మండలంలో కొన్ని కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల తీరుతో పిల్లల చదువులు తల్లిదండ్రులకు ఆర్థికభారంగా మారుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు పాతరేసి అడ్డగోలుగా ఫీజులు పెంచేశారు. అయినా విద్యాశాఖాధికారులు తమకేమీ సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తుండడంపై తల్లిదండ్రుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు లేకున్నా దర్జాగా నిర్వహిస్తున్నారు. స్కూళ్లలోనే పుస్తకాలు, యూనిఫారాలు విక్రయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయాల్సిన మండల విద్యాశాఖాధికారులు 'మామూలు'గా తీసుకోవడంలో ఆంతర్యమేమిటని విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

తనిఖీలేవీ

ప్రైవేటు స్కూళ్లలో నిబంధనల ప్రకారం వసతులు, ఇతర సౌకర్యాలు ఉన్నాయో లేవోనని అధికారులు కనీసం తనిఖీలు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంఈవో సోమేశ్వరరావు డిప్యూటీ డీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయన మండల పర్యటనలకు సమయం వెచ్చించలేకపోతున్నారనే అపవాదు ఉంది. ఎంఈవో–2 దివాకర్ స్థానికంగా ఉన్నా ఆయనకు ప్రైవేటు స్కూళ్లపై అజమాయిషీ లేకపోవడంతో తనిఖీలకు వెళ్లడం లేదని తెలుస్తోంది. ఈ పరిణామాలతో తమను అడిగేవారు లేరనే ధీమాతో కొన్ని ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు ఇష్టానురీతిన వ్యవహరిస్తూ, విద్యావ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


స్కూల్‌కు అనుబంధంగా పుస్తక విక్రయకేంద్రం

ఎన్ఏడీ సెంటర్ బీఆర్‌టీఎస్ రోడ్‌లో ఉన్న ఓ ప్రైవేటు స్కూల్‌కు హైస్కూల్ పర్మిషన్ మాత్రమే ఉంది. ఇక్కడ 6 నుంచి 10వ తరగతి వరకు మాత్రమే అడ్మిషన్లు ఇవ్వాలి. కా, ఈ స్కూల్లో ఒకటో తరగతి నుంచి విద్యార్థులను చేర్చుకుంటున్నారు. ఏపీఎస్ఈబీ కాలనీలో ఉన్న తమ బ్రాంచి పేరుతోనే ఇక్కడ కూడా ప్రైమరీ సెక్షన్లు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల యాజమాన్యం విద్యావ్యాపారం చేస్తోంది.

ప్రైవేటుదే హవా

కూటమి ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొస్తున్న మార్పులతో కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలకు రెక్కలు వచ్చాయి. ప్రైవేటు స్కూళ్లలో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. గోపాలపట్నం మండలంలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 38 స్కూళ్లు ఉండగా, వీటిలో 8,800 మంది చదువుతున్నారు. ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 103 స్కూళ్లు ఉండగా వీటిలో 33 వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. ఈ లెక్కన ప్రభుత్వ స్కూళ్లలో కంటే ప్రైవేటు వైపు వెళ్లే విద్యార్థుల సంఖ్య నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది.ఎటువంటి అనుమతుల్లేకుండా ఎక్కడిపడితే అక్కడ ప్లే స్కూళ్లు సైతం వెలుస్తున్నాయి. 2025–26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు ప్రక్రియ కొనసాగుతున్నందున ప్రైవేటు స్కూళ్లలో చేరే వారి సంఖ్య ఇంకా పెరుగుతోందని అంచనా వేస్తున్నారు.

రక్షణగోడ కట్టారు


నిర్మించిన రక్షణ గోడ


సాక్షి
ఎస్‌పీడీ స్థలంలో చొరబాటు!

సాక్షిలో ప్రచురితమైన వార్త

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: ఎన్ఏడీ ఫ్లై ఓవర్ నుంచి విమానాశ్రయానికి వెళ్లే జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న కేంద్ర నిఘా సంస్థలకు చెందిన స్థలం ఆక్రమణను అడ్డుకునేందుకు ఎట్టకేలకు అధికారులు చొరవ తీసుకున్నారు. సాకేతపురంలో ఎన్ఏడీ స్థలానికి రక్షణగా నిర్మించిన గోడను కొంతమంది తొలగించి సొంత అవసరాలకు వినియోగిస్తున్నవైనాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన అధికారులు తొలగించిన గోడను పునర్నిర్మించారు. అయితే నిర్మించిన గోడకు చిన్న పాటి దారి వదిలేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడి బహుళ అంతస్తుల నిర్మాణ దారులు తమ అవసరాల కోసం ఇలా దారిని ఏర్పాటు చేసుకున్నారని చుట్టుపక్కల వారు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే స్థలం పరిరక్షణకు అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

పచ్చని చెట్టుపై వేటు!

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్‌లో నూతనంగా నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ ముందు ఉన్న భారీ వృక్షం మోడువారింది. నిన్నమొన్నటి వరకు పచ్చదనంతో నిండుగా ఆ దారిలో వెళ్లే వారికి నీడనిచ్చింది.ఆ చెట్టు నేడు మోడువారి కనిపిస్తోంది. బహుళ అంతస్తు భవనానికి అడ్డంగా ఉందని, నరికేశారా..? లేక అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లకు అడ్డు వస్తుందని విద్యుత్ శాఖ వారు దాన్ని తుంచేశారా..? అనేది తేలాల్సి ఉంది. పర్యావరణ పరిరక్షణ కోసం జీవీఎంసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటుతుండగా, మరో పక్క ఇలా భారీ వృక్షాలను నరికేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


మోడువారిన చెట్టు

పరిసరాల పరిశుభ్రతతో పర్యావరణ పరిరక్షణ

మహారాణిపేట: జిల్లా పరిషత్‌లో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర'మూడో శనివారం కార్యక్రమం జరిగింది. సీఈవో పి.నారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వచ్ఛత ఆవశ్యకత, పచ్చదనం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ప్రాంగణాన్ని శుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అలాగే గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం సూపరింటెండింగ్ ఇంజినీర్, పంచాయతీ రాజ్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయాల్లో కూడా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఏపీపీఆర్ఎంఈఏ అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, ఏపీఎన్జీవో జాయింట్ సెక్రటరీ ఎ.మదన్‌మోహన్, పరిపాలనాధికారులు మంజులవాణి, ఎం.నరసింహమూర్తి, పి.వి.వి.ఎస్. మూర్తి, రాజేశ్వరి, జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది, పంచాయితీరాజ్ అధికారులు, సిబ్బంది, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

ప్రశాంతంగా పాలిసెట్ కౌన్సెలింగ్


పాలిటెక్నిక్ కాలేజీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది


గైస్‌లో విద్యార్థికి రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకరమణ

మురళీనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో సాంకేతిక కోర్సుల్లో ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. యోగాంధ్ర కార్యక్రమం ఉన్నప్పటికీ, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ , కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కౌన్సెలింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నానికి విద్యార్థుల హాజరు పూర్తి స్థాయిలో ఉంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 7,501 నుంచి 15,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 296 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. వీరిలో 234 మంది బీసీ విద్యార్థులు, 44 మంది ఓసీలు, 17 మంది ఎస్సీలు, ఒకరు ఎస్టీ విద్యార్థి ఉన్నారు. వీరందరికీ రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రత్నకుమార్ పర్యవేక్షణలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ డాక్టర్ పి.ఎం . భాషా, లెక్చరర్ నాగరాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆదివారం 23,501 నుంచి 32,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ లో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ జరిగింది. ఇక్కడ 1 నుంచి 7,500 ర్యాంక్ వరకు గల విద్యార్థులకు రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ అందించారు. ఆదివారం 15,001 నుంచి 23,500 ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

సిరులతల్లికి తులసిపూజ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగా.. ఉత్సాహంగా

- ప్రభుత్వ సంస్థల్లో వేడుకలు
- పాఠశాలల్లో విద్యార్థుల ఆసనాలు


మర్రిపాలెం రైతు బజారులో సూర్యనమస్కారాలు చేస్తున్న రైతులు


90వవార్డు ఏపీఎస్ఈబీ కాలనీ పార్కులో..

గోపాలపట్నం: యోగాంధ్రలో గోపాలపట్నం వాసులు తామూ ఒకరై పాలుపంచుకున్నారు. పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. వక్తలు మాట్లాడుతూ యోగా వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకుంటే ఆరోగ్యం సొంతమవుతుందన్నారు.

ఎన్ఎస్‌టీఎల్‌లో..

ఎన్ఎస్‌టీఎల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం ఉదయం 6 గంటల నుంచి 7.30 వరకు యోగాసనాలు వేశారు. కార్యక్రమాన్ని డీఆర్‌డీవో విశిష్ట శాస్త్రవేత్త, డైరెక్టర్ జనరల్ (నేవల్ సిస్టమ్స్, మెటీరియల్స్) డాక్టర్ ఆర్‌వీ హరప్రసాద్ ప్రారంభించారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని యోగా గురువు, భద్రతా అధికారి అల్లంరాజు విశ్వేశ్వరరావు పర్యవేక్షించారు. 110 మంది సభ్యులు పాల్గొని, యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, శాస్త్రవేత్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో...

విశాఖ విమానాశ్రయంలో ఉదయం 6 గంటలకు అంతర్జాతీయ యోగాడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విమానాశ్రయం సిబ్బంది, సీఐఎస్ఎఫ్ జవాన్లు, ఎయిర్‌లైన్స్ సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు ఇన్‌చార్జి డైరెక్టర్ ఎస్.పురుషోత్తం పాల్గొన్నారు.

పాఠశాలల్లో...

గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో, గోపాలపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో యోగా డే వేడుకలు నిర్వహించారు. బాలికల పాఠశాల హెచ్ఎం స్వర్ణలత ఆధ్వర్యంలో పీడీ కళావతి, లెక్చరర్ రమణబాబు పరవేక్షణలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. గోపాలపట్నం బాలుర హైస్కూల్‌లో హెచ్ఎం వేణుగోపాల్ ఆధ్వర్యంలో పీఈటీ సత్యకళ పర్యవేక్షణలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, ఉద్యోగులు పాల్గొని యోగాసనాలు వేశారు.

- హెచ్‌సీ వెంకటాపురం హైస్కూల్‌లో ఉపాధ్యాయులు యోగాసనాలు వేస్తూ విద్యార్థుల చేత వేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతటా యోగాసనాలు

విశాఖ విద్య: అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా శనివారం జీవీఎంసీ 52,90వ వార్డుల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ సంస్థల ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. మర్రిపాలెం రైతు బజారులో రైతులు, దుకాణదారులు కలసి యోగసనాలు వేశారు. రైతు బజారు ఈవో నాగేశ్వరరావు యోగా గురువును రప్పించి యోగ వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీ పార్కులో కాలనీ వాసులంతా సామూహికంగా యోగాసనాలు వేశారు.

ఆర్‌పీఎఫ్ కార్యాలయంలో..

గోపాలపట్నం: మర్రిపాలెం డాగ్ స్క్వాడ్ కార్యాలయంలో యోగా డేను ఘనంగా నిర్వహించారు. డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఆర్‌పీఎఫ్ ఎస్ఐ కేవీఎస్ పటాన్నయక్ ఆధ్వర్యంలో జవాన్లు యోగాసనాలు వేశారు. డాగ్స్‌తో ఆసనాలు వేయించారు. ఆదేశాలు ఇచ్చిన విధంగా శునకాలు ఆసనాలు వేస్తుండటంతో స్థానికులు చూసి, ముచ్చటపడ్డారు.


యోగాసనాల్లో గురువులు


ఆర్‌పీఎఫ్ జవాన్లతో యోగాసనాలు వేస్తున్న డాగ్ స్క్వాడ్


గోపాలపట్నం బాలుర హైస్కూల్‌లో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


ఎన్ఎస్‌టీఎల్‌లో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు


విశాఖ విమానాశ్రయం ప్రాంగణంలో ..

జూలో జిరాఫీలపై విద్యార్థులకు అవగాహన


జిరాఫీ ఎన్‌క్లోజర్ వద్ద జిరాఫీ మాస్కులు వేసుకున్న చిన్నారులతో జూ అధికారులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో శనివారం అధికారులు ప్రపంచ జిరాఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీల్లో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులు గ్రూప్‌లుగా పాల్గొని ప్రతిభ చూపారు. జిరాఫీపై కథలు, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం యానిమల్ కీపర్లతో మాట్లాడించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అధికారులు జిరాఫీ మాస్కులు పంపిణీ చేశారు. వారిని జిరాఫీ ఎన్‌క్లోజర్ వద్దకు తీసుకెళ్లి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు వన్యప్రాణుల విద్య అవసరమన్నారు. వాటి గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జూలో ఉన్న జిరాఫీలు రెట్టిక్యులేటెడ్ ఉపజాతికి చెందినవన్నారు. వాటి గురించి విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు.